హోరాహోరీగా స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

నందికొట్కూరు: పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్ మైదానంలో రెండోరోజు మంగళవారం స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు హోరాహోరీగా సాగాయి. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాల బాలికలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. ముందుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ షేక్షావలి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఉషారాణి క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, షటిల్‌బ్యాడ్మింటన్, యోగా, చెస్ పోటీల్లో నియోజవర్గ వ్యాప్తంగా 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి ఉన్నత విద్యలోనూ, ఉద్యోగాల్లోనూ ప్రాధాన్యత ఉంటుందన్నారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడలకు సమయం కేటాయించాలన్నారు.

విజేతలు వీరే..

అండర్-17 విభాగంలో కబడ్డీలో విన్నర్స్‌గా కొత్తపల్లి మండలం, రన్నర్స్‌గా జూపాడుబంగ్లా మండలం క్రీడాకారులు నిలిచారు. అండర్-14 విభాగంలో నందికొట్కూరు మండలం విన్నర్స్‌గా, కొత్తపల్లి మండలం క్రీడాకారులు రన్నర్స్‌గా నిలిచారు. అండర్-17 విభాగం ఖోఖోలో కొత్తపల్లి మండలం బాలికలు విన్నర్స్‌గా, మిడుతూరు మండలం క్రీడాకారిణులు రన్నర్స్‌గా నిలిచారు. అండర్-14 విభాగంలో నందికొట్కూరు మండలం విన్నర్స్, కొత్తపల్లి మండలం క్రీడాకారిణులు రన్నర్స్‌గా నిలిచారు. అండర్-17 బాలికల వాలీబాల్ విభాగంలో జూపాడు బంగ్లా మండలం క్రీడాకారిణులు విన్నర్స్‌గా, నందికొట్కూరు మండలం క్రీడాకానిణులు రన్నర్స్‌గా నిలిచారు. అండర్-17 బాలికలు షటిల్ బ్యాడ్మింటన్ విభాగం సింగిల్స్‌లో విన్నర్స్‌గా మమత, రన్నర్స్‌గా రాజేశ్వరి నిలిచారు. అండర్-14 విభాగంలో విన్నర్స్‌గా యశశ్విని, రన్నర్స్‌గా సైఫా నిలిచారు. అండర్-17 యోగా విభాగంలో విన్నర్స్ అయేషా, రన్నర్స్‌గా రక్షిత నిలిచారు. అండర్-14 విభాగంలో నందికొట్కూరు మండలం విన్నర్స్ జోషిత, రన్నర్స్‌గా సింధు నిలిచారు. గెలుపొందిన క్రీడాకారులకు గవర్నమెంట్ హైస్కూల్ హెచ్‌ఎం రామిరెడ్డి ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ నియోజక వర్గ కో ఆర్డినేటర్ కృష్ణ, ఎస్‌జీఎఫ్ మండల కో ఆర్డినేటర్లు వీరన్న, రాజశేఖర్, వెంకటేష్, శ్రీనివాసులు, మురళీనాయక్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్, రవికుమార్, రామకృష్ణ, శివన్న, సుంకన్న, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, శ్రీధర్, డోరతి, పద్మలత, జెసింత, విజయకుమారి, రాజేశ్వరి, సరస్వతి, జయమ్మ, అరుణ, చెన్నమ్మ, పద్మ పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారిణులు


అండర్-17 ఖోఖోలో విన్నర్స్‌గా నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైన కొత్తపల్లి మండలం బాలికల జట్టు


అండర్-17 వాలీబాల్‌లో విన్నర్స్‌గా నిలిచిన జూపాడుబంగ్లా మండలం క్రీడాకారులు

రాష్ట్రస్థాయి పోటీలకు జూనియర్ కాలేజీ విద్యార్థులు


రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నందికొట్కూరు: ఈనెల 2, 3 తేదీలతో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ షేక్ షేక్షావలి మాట్లాడుతూ గత నెల 25 నుంచి 30వ తేదీ వరకు కర్నూలు జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలో అండర్- 19 రగ్బీ విభాగంలో తమ విద్యార్థులు తబసు మ్, పూజిత, ఖోఖోలో చరణ్, కబడ్డీలో సుధీర్, త్రోబాల్‌లో షాలెమ్‌రాజు ప్రతిభ కనబరిచారన్నారు. కర్నూలు జిల్లా కేంద్రంలోని ఆదర్శ జూనియర్ కళాశాలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలోనూ తమ విద్యార్థులు ప్రతిభ చాటాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులను అధ్యాపకులతో కలిసి అభినందించారు.

క్లుప్తంగా

కమనీయం...కల్యాణం


మహానందీశుడి దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి కల్యాణం మంగళవారం కమనీయంగా సాగింది. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కల్యాణ తంతును జరిపించారు.

నేడు నంద్యాలకు మహానందీశ్వరుడి దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామి బుధవారం నంద్యాలకు వెళ్లనున్నారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆనవాయితీ మేరకు నంద్యాలలోని బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయానికి వెళ్తారని ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, వేద పండితులు రవిశంకర అవధాని మంగళవారం తెలిపారు. తొమ్మిది రోజుల పాటు పూజలందుకుని విజయదశమి రోజున తిరిగి మహానందికి వస్తారన్నారు.

నేటి నుంచి దసరా సెలవులు

పాములపాడు/జూపాడుబంగ్లా/ఆత్మకూరు: ప్రభుత్వం పాఠశాలలకు బుధవారం నుంచి ఈనెల 13 వరకు దసరా సెలవులను ప్రకటించింది. దీంతో హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు తమ సొంత ఊళ్లకు బయలుదేరారు. తల్లిదండ్రులు హాస్టళ్ల వద్దకు చేరుకుని తమ పిల్లలను తీసుకెళ్లారు.

గుడ్డు పెంకులతో బహుమతుల తయారీ

మహానంది: వాడేసిన కోడిగుడ్డు పెంకులతో తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినులు ఆకర్షణీయ బహుమతులు తయారు చేశారు. రంగులు పూసి పుట్టగొడుగుల్లా, పుష్పాల్లా తీర్చిదిద్దారు. వాటిని ప్రిన్సిపాల్ లక్ష్మణరావుకు బహుకరించడంతో విద్యార్థినుల ప్రతిభను ఆయన మెచ్చుకున్నారు.

రెండు ప్రభుత్వ గృహాల కూల్చివేత


శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలో ప్రభుత్వ జలవనరుల శాఖకు చెందిన రెండు 'ఏ'టైపు గృహాలను అనధికార వ్యక్తులు మంగళవారం కూల్చివేశారు. అధికార పార్టీకి చెందిన మండలస్థాయి నాయకుడు ఒకరు అందులో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు. ఎటువంటి అధికార అనుమతులు లేకుండా గృహాలను కూల్చివేశారు. ఈ విషయమై అతడిని వివరణ కోరగా పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని, పునర్నిర్మాణం కోసం కూల్చి వేశామని చెప్పుకొచ్చారు. కాగా డ్యాం ఎస్‌ఈ శ్రీరామచంద్రమూర్తి వివరణ కోసం ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ


స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దాతలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన టి.వేణుగోపాల్, రేఖారాణి దంపతులు శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వేదాశీర్వచనం మండపంలో దాతలు 53 చీరలు, 10 పంచెలను అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు పి.మార్కండేయశాస్త్రి, పీఆర్వో టి.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు కె.అయ్యన్న, ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునలకు అందజేశారు. దాతలకు స్వామిఅమ్మవర్ల శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఫారెస్ట్ అధికారుల మెరుపు దాడి


సైకిళ్లను స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ అధికారులు

బండిఆత్మకూరు: స్థానిక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జెడ్.నాసిర్‌జా ఆధ్వర్యంలో సిబ్బంది నారపురెడ్డి కుంట సెక్షన్‌లోని జాగ్వర్ బేస్ క్యాంపు నుంచి బొమ్మరస్తా, మసిబండ రస్తాలో మెరుపు దాడులు నిర్వహించి దోమతెర కట్టెలు, కలపను రవాణా చేస్తున్న 13 సైకిళ్లను స్వాధీనం చేసుకొని, గాజులపల్లె టింబర్ డిపోకు తరలించారు. దాడుల్లో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు తేజానాయక్, రామేశ్వరి, ప్రసన్న, మొబైల్ పార్టీ టీం, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ హైమావతి, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి అమ్మవారి అలంకరణలు

ఆత్మకూరు: దేవీ శరన్నవ రాత్రోత్సవాల సందర్భంగా పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి బుధవారం నుంచి వివిధ రూపాల్లో దర్శనమివ్వనున్నారు. 3 కామాక్షిదేవి, 4న మహాలక్ష్మీదేవి, 5న వెంకటేశ్వరస్వామి, 6న లలితాదేవి, 7న అన్నపూర్ణాదేవి, 8న మహాగౌరీదేవి, 9న సరస్వతిదేవి, 10న రాజరాజేశ్వరిదేవి, 11న మహిసాసుర మర్దిని, 12న విజయలక్ష్మిదేవి అలంకరణతో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

పాములపాడు: విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, జిల్లా వ్యవసాయ వనరుల అధికారిణి హేమలత సూచించారు. మంగళవారం మండల కేంద్రం సమీపంలోని వ్యవసాయ పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సాగు యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. మినుములో కాండపు ఈగ నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ 8 కేజీలు ఎకరాకి దుక్కిలో వేసుకోవాలని సూచించారు. వరి పంటలో కాండం తొలిచే పురుగు, ఆకుముడత నివారణకు కార్టాప్ హైడ్రో క్లోరైడ్ ఎకరాకి 8 కేజీల చొప్పున వేయాలన్నారు. సుడిదోమ నివారణకు ఆకు పచ్చని జిగురు అట్టలు, ఎకరాకి 10 చొప్పున పొలంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు.

● పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోట, ఎం.ఘణపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు చేపట్టారు. ఏఓ విజయ్‌జ్యోతుకుమార్ మాట్లాడుతూ వరిలో సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు.

● కొత్తపల్లి: శివపురం, గుమ్మడాపురం గ్రామాల పరిధిలోని పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పైర్లకు ఆశించిన పురుగు నివారణకు రసాయనాలను ఎక్కువగా వాడితే ఆహారం కలుషితమవుతుందని ఏఓ మహేష్ రైతులకు వివరించారు.


పాములపాడు: రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారి

● మహానంది: బుక్కాపురం, అల్లినగరం గ్రామాల పరిధిలోని పొలాల్లో వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. అరటిలో సిగటోకా తెగుళ్ల నివారణకు ప్రొఫికొనజోల్ మందును లీటరు నీటికి ఒక మిల్లీ లీటరు, ఐదు నుంచి పది మిల్లీలీటర్ల మినరల్ ఆయిల్‌ను కలుపుకుని వాడాలని ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఠాగూర్ నాయక్ రైతులకు సూచించారు.

● జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల, పారుమంచాల గ్రామాల్లో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి, ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో అధికదిగుబడులు సాధించాలని ఏఓ కృష్ణారెడ్డి రైతులకు సూచించారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

మహానంది: పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మహానంది ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి అన్నారు. స్వభవ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. డాక్టర్ వి.జయలక్ష్మి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు.

సమస్యలు కనిపించవా

మహానంది: మంచి ప్రభుత్వం అని ఊకదంపుడు ప్రచారం చేసే కూటమి ప్రభుత్వానికి గ్రామాల్లో సమస్యలు కనిపించకపోవడం సిగ్గుచేటని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ విమర్శించారు. మండల కార్యదర్శి సామేలు ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధులు విడుదల చేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మహేశ్వరమ్మ, గురుమూర్తి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

మహానంది: బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎం.తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు కోరారు. మంగళవారం విద్యార్థులకు బాల్య వివాహాల వ్యవస్థ, నష్టాలపై అవగాహన కల్పించారు.

సంక్షిప్తం

ఇండస్ట్రియల్ విజిట్

బండిఆత్మకూరు: స్థానిక ఆదర్శ పాఠశాల ఇంటర్మీడిమెట్ విద్యార్థులకు ఒకేషనల్ ట్రైనర్ ఎస్‌జీ మదార్‌షావలి ఆధ్వర్యంలో మీ సేవ సెంటర్‌లో ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. వీటివల్ల విద్యార్థులకు వృత్తి నైపుణ్యంతో పాటు అనుభవ పూర్వక జ్ఞానం వెలువడుతుందని పాఠశాల ప్రిన్సిపల్ మహమ్మద్ రఫీ తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏపీ రైతుసంఘం మండల కార్యదర్శి వీరన్న, నాయకులు కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం కరివేన గ్రామంలో రైతులు ఆరబోసిన మొక్కజొన్న దిగుబడులను పరిశీలించారు. వర్షం ధాటికి తట్టుకొని అరకొరగా చేతికొచ్చిన దిగుబడులను ప్రభుత్వం మద్దతు ధరలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఏపీజీబీ సేవల్లో అంతరాయం

జూపాడుబంగ్లా: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలు మంగళవారం మధ్యాహ్నం వరకు స్తంభించిపోవటంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దసరా సమీపిస్తుండటంతో బ్యాంకు ఖాతాదారులు వారి ఖాతాల్లోని నగదు లావాదేవీలు చేసుకునేందుకు బ్యాంకుకు చేరుకోగా ఆన్‌లైన్ పనిచేయక మధ్యాహ్నం 2 గంటల వరకు పడిగాపులు కాశారు. 2 గంటల అనంతరం ఆన్‌లైన్ పని చేయడంతో ఖాతాదారులు నగదు తీసుకుని వెళ్లారు.

పంటల పరిశీలన

వెలుగోడు: మండల పరిధిలోని గుంతకందాల, అబ్దుల్లాపురం గ్రామ పొలాల్లో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటను మంగళవారం ఏఓ పవన్ కుమార్ పరిశీలించారు.

పిచ్చిమొక్కల తొలగింపు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో పెరిగిన పిచ్చి మొక్కలను మంగళవారం విద్యార్థులు తొలగించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.పద్మ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్.కె.రాజన్న ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు.

మహిళ గర్భాశయం వద్ద భారీ కణితి

● శస్త్రచికిత్స ద్వారా తొలగించిన అశ్వనీ ఆసుపత్రి డాక్టర్లు

ఆత్మకూరురూరల్: ఓ మహిళ గర్భాశయంలోని భారీ కణితిని స్థానిక అశ్వనీ ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. వివరాలను ఆసుపత్రి వైద్యులు అనంతయాదవ్, డాక్టర్ ప్రసన్నలక్ష్మి విలేకరులకు వెల్లడించారు. మండల పరిధిలోని ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన షంషూన్‌బీ గత నెల 29న కడుపు నొప్పితో ఆసుపత్రిలో చేరింది. పరీక్షలు నిర్వహించి గర్భాశయానికి ఆనుకుని భారీ ఓవేరియన్ సిస్ట్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. మంగళవారం షంషూన్‌బీకి శస్త్ర చికిత్స చేసి 5.45 కేజీల గడ్డను తొలగించారు. హార్మోన్ల అసమతుల్యం వల్ల ఏర్పడుతుంటాయని వైద్యులు అనంత్ యాదవ్ తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్స చేసినట్లు ఆయన తెలిపారు. కాగా డాక్టర్లకు షంషూన్‌బీ బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.


కణితిని చూపుతున్న వైద్యులు

వైద్యసిబ్బంది నిర్లక్ష్యంతోనే మెట్లపై ప్రసవం


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగసారి సుంకన్న

కొత్తపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది నిర్లక్ష్య ధోరణితోనే గిరిజన మహిళ మెట్లమీద ప్రసవం అయిందని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ ఒంగోలు, నంద్యాల జిల్లాల అధ్యక్షుడు నాగసారి సుంకన్న ఆరోపించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత నెల 21న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెట్లపైనే ఈదమ్మ ప్రసవమైన విషయాన్ని నంద్యాల ప్రజావేదికలో ఫిర్యాదు చేశానన్నారు. విచారణలో భాగంగా తనను వైద్య సిబ్బంది పిలిచి తమ కప్పును కప్పిపుచ్చుకునేందుకు యత్నిస్తున్నారన్నారు. మరొకరికి ఇలాంటి ఘటన జరగకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

ప్రజలకు మంచి చేస్తేనే గుర్తింపు

వెలుగోడు: ప్రజలకు మంచి చేస్తేనే గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ శ్రీనివాసగౌడ్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు ఆత్మకూరుకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా తహసీల్దార్, వీఆర్వోలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆంజనేయులు ఉద్యోగ రీత్యా ఎప్పటికప్పుడు అధికారుల ఆదేశాల మేరకు పనిచేసి మండలంలో గుర్తింపు తెచ్చుకోవడం సంతోషకరమన్నారు. ఉద్యోగరీత్యా బదిలీలు సర్వసాధారణమన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, వీఆర్వోలు మహబూబ్ బాషా, రమణ, సుగుణాకర్, వేణుగోపాల్, వెంకటశివుడు, జెబి ఉల్లా పాల్గొన్నారు.


డీటీని సన్మానిస్తున్న తహసీల్దార్,సిబ్బంది

మద్యం దుకాణాలు బంద్

● విధులకు హాజరుకాని సిబ్బంది
● ప్రభుత్వ ఆదాయానికి గండి

పాములపాడు/జూపాడుబంగ్లా/ఆత్మకూరు: ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారం బంద్ చేశారు. మద్యం షాపుల్లో పని చేస్తున్న సిబ్బంది సెప్టెంబర్ 30 నాటికి అగ్రిమెంట్ పూర్తి కావడం, నూతన మద్యం పాలసీ తెస్తుండటంతో తమనే నియమించుకోవాలనే డిమాండ్‌తో సిబ్బంది విధులకు గైర్హాజరై నిరసన తెలిపారు. విషయం తెలియని మద్యం ప్రియులు దుకాణాల వద్దకు వచ్చి వెనుదిరిగారు. ఫలితంగా లక్షల్లో ఆదాయం ప్రభుత్వానికి గండిపడింది. కాగా వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం దుకాణాల నిర్వహణ బాధ్యతలు ప్రభుత్వమే తీసుకొని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. ప్రతి దుకాణానికి ముగ్గురిని కేటాయించడంతో వారికి ఉద్యోగ అవకాశం లభించి వారి కుటుంబాలు సంతోషంగా జీవనం సాగించాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్ణయంతో మద్యం షాపులు ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చేందుకు నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం విధితమే. తదుపరి గ్రామ గ్రామాన బెల్టు షాపులు వెలిసే అవకాశాలు లేకపోలేదని, మద్యం ఏరులై పారడం ఖాయమని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.


జూపాడుబంగ్లాలో మద్యం మూసివేసిన దుకాణం వద్ద పహారా కాస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్

దసరా మహోత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న దసరా మహోత్సవాలకు తరలిరావాలని పలువురు ప్రముఖులకు దేవస్థాన అధికారులు ఆహ్వాన పత్రికలను అందించారు. మంగళవారం రాష్ట్ర రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి దంపతులకి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి శ్రీశైల దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు ఆహ్వాన పత్రికలను, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

బహుమతుల పంపిణీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, వకృత్వ, క్విజ్ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. మంగళవారం శ్రీశైలంలోని జిల్లా పరిషత్‌పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్.రమణమ్మ, ప్రజా సంబంధాల అధికారి టి.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వెంకటరమణ, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్ పర్సన్ వెంకటలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకటశివుడు పాల్గొన్నారు.

నేడు మాంసం, మద్యం విక్రయాలు బంద్

ఆత్మకూరు: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఎలాంటి మాంసం విక్రయాలు, మద్యం విక్రయాలు నిర్వహించరాదని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎవరైనా జంతువులు, కోళ్లను వధించి మాంసం విక్రయాలు జరిపితే జరిమానాతోపాటు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లాస్థాయి పోటీలకు కురుకుంద విద్యార్థులు

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో మండలంలోని కురుకుంద పాఠశాల విద్యార్థులు రాజు (యోగా), ఇంతియాజ్(కబడ్డీ) ప్రతిభ కనబరిచిన జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకటస్వామి మంగళవారం తెలిపారు. అలాగే జిల్లాస్థాయి పోటీలకు అండర్-14 బాలికల వాలీబాల్ విభాగంలో విన్నర్‌గా, అండర్-14 బాలుర వాలీబాల్‌లో రన్నర్‌గా ఉమేరా, సమీరా, సఫియా, మహిత, వైష్ణవి, అక్షయలు, అండర్-17 వాలీబాల్ బాలికల విభాగంలో నాగేశ్వరమ్మ, ఉమేర్నీ, శాంతి, శృతి, కీర్తి, ఉమారా, జాస్మిన్, శివమ్మ జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరిని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం లక్ష్మణ్, ఉపాధ్యాయులు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

అర్హులందరికీ పింఛన్ల పంపిణీ

● ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. మంగళవారం 10 బొల్లవరం గ్రామంలో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1వ తేదీనే పింఛన్‌దారులకు పింఛన్లు అందించడం సంతోకరమనిన్నారు.

● పాములపాడు: మండలంలో మంగళవారం 97 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ గోపీక్రిష్ణ తెలిపారు. పింఛన్ల పంపిణీని ఈఓపీఆర్డీ గంగాధర్‌తో కలిసి ఆయన పర్యవేక్షించారు.

● కొత్తపల్లి: మండలంలోని కొత్తపల్లి భ్రమరాంబా గిరిజన గూడెం, నందికుంట గ్రామాల్లో జరుగుతున్న పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రత్యేకాధికారి చింతామణి తనిఖీ చేశారు. మొదటి రోజు 97.5 శాతం పూర్తయినట్లు ఆమె తెలిపారు.

● మిడుతూరు: మండలంలో 98 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ జీఎన్‌ఎస్‌రెడ్డి తెలిపారు. మిగతా పింఛన్లు ఒకటి, రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.

● పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే బుడ్డా

వెలుగోడు: పట్టణంలోని ద్వారకా నగర్‌లో జరుగుతున్న పింఛన్ల పంపిణీలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. పింఛన్‌దారులకు పింఛన్ సొమ్మును అందజేశారు. ఎన్నికల హామీలను దశలవారీగా నెరవేరుస్తామని ఆయన తెలిపారు.

● ఆత్మకూరు: మండలంలో 4,862 మంది పింఛన్‌దారులకు గానూ 4,666 మందికి పింఛన్లను అందించినట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్, పట్టణంలో 4,289 పింఛన్లకు గానూ 3,982 పింఛన్లను పంపిణీ చేశామని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. మిగతా వారికి వీలైనంత త్వరలో అందజేస్తామన్నారు.

● జూపాడుబంగ్లా: మండలంలోని 96.04 శాతం పింఛన్ల పంపిణీ పూర్తైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలోని భ్రమరాంబా చెంచుగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని నియోజకవర్గ ప్రత్యేక అధికారి సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ చింతామణి మంగళవారం ఎంపీడీఓ మేరితో కలిసి తనిఖీ చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలు తెలుసుకున్నారు. వారికి సిబ్బంది పౌష్టికాహారం ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు.

రైతు సంఘాల సమీక్ష సభలు

బండిఆత్మకూరు: మండలంలోని పార్నపల్లి గ్రామంలో మంగళవాకం సీపీఎం, రైతు సంఘాల నాయకులు రత్నమయ్య, సుధాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూ సేకరణ చట్టం అమలు చేసి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన సూపర్-6 హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి రుణాలు ఇవ్వాలని కోరారు. అనంతరం గ్రామ శాఖ కార్యదర్శిగా రాజును, సభ్యులుగా నాగరత్నం, మహేష్ సుధాకర్ రెడ్డిలను ఎన్నుకున్నారు.


మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

అలరించిన పేరిణి లాస్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై జనగామ జిల్లాకు చెందిన చంద్ర కళా నిలయం వారి పేరిణి లాస్యం, ఆంధ్రనాట్య ప్రదర్శన అలరించింది. వినాయకగద్య, బ్రహ్మగద్య, సంధ్యాతాండవం, మూషికవాహన, మహాగణపతిం, నమోనమో నటరాజ, తహనం సమయతి, దేవికైవారం తదితర గీతాలకు శిరీషలక్ష్మి, హర్షిణి, అక్షర, సహస్ర, నిత్యశ్రీ, అక్షయ, జశ్విత, శ్రీవాణి, హిమశ్రీ, రేణుశ్రీ, సింధుశరణ్య, భవ్యశ్రీ తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.



నృత్య ప్రదర్శనలో కళాకారులు

రస్తా ఆక్రమణ తొలగింపులో కదలిక


ఆక్రమణలు తొలగిస్తున్న ఇంటి యజమాని

వెలుగోడు: పట్టణంలోని రాజా వీధిలో రస్తా ఆక్రమణల సమస్య మంగళవారం అధికారుల చర్యలతో కదిలిక వచ్చింది. రాజా వీధి నుంచి ఎనుముల వీధికి వెళ్లే రస్తా ఆక్రమణలకు గురి కావడంతో గత ఏడాది జనవరి 3న అదే కాలనీకి చెందిన పార్వతయ్య ఫిర్యాదు చేశాడు. అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో కలెక్టర్ నిర్వహించే స్పందనకు 12సార్లు, ఆత్మకూరు సివిల్ కోర్టులో, లోక్ అదాలత్‌లోనూ ఫిర్యాదు చేశారు. ఐదు నెలల క్రితం లోకాయుక్తను ఆశ్రయించారు. దీంతో తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐ, ఈఓఆర్డీ, పంచాయతీ కార్యదర్శితో కూడిన కమిటీ రస్తాను పరిశీలించి, కొలతలు వేసి మార్కింగ్ వేయడంతోపాటు ఆక్రమణదారులకు మూడు నోటీసులు ఇచ్చారు. కాగా కలెక్టరు, డీపీఓ ఆదేశాలతో అర్జీ దారుడు పార్వతయ్య మంగళవారం తన ఇంటి ముందున్న అరుగు, మెట్లు తొలగించి మిగతా ఆక్రమణలు కూడా తొలగించాలని అధికారులను కోరారు.